# పరమానందాయ శిష్యులు

చంద్రగ్రహణం పడుతూంది. చంద్రుడిలో మొర్రి ఏర్పడుతూన్న కొద్దీ ప్రపంచమంతా కాటుకరంగు పూసుకుంటూంది..

అదే సమయం—కొందరు మహానుభావులకు బుద్ధి చెదిరిపోయి, పిచ్చి ఎత్తడానికి!

గిండీ స్టేషన్లో రైలు ఆగింది. ఆరుగురు సోల్జర్లుదిగి, టిక్కెట్లిచ్చి, స్టేషను అవతలకు వెళ్ళేరు.

'సార్, సార్' అంటూ రిక్షావాళ్ళు వాళ్ళను చుట్టుముట్టేరు.

ఆరుగురు సోల్జర్లు!

ఆ రిక్షావాళ్ళ నందర్నీ పొమ్మని, ఒక్కణ్ణే వుండమన్నారు—

'ఎంతమంది ఎక్కుతారు?' అన్నాడు ఆ రిక్షావాడు ప్రాణాలు బిగబట్టి.

'ఆరుగురం ఎక్కుతాం - తీసికెళ్లు' అన్నారు ఆ యోధులు.

'మీకో సలాం!' అని ఆ రిక్షావాడు అక్కడనుంచి పోతున్నాడు, ప్రాణాలు దక్కించుకుందుకని,

ఆపేరు వాడిని, ఆ సోల్జర్లు.

వాడికి ముచ్చెమట్లూ పోశాయి.

ఆరుగురు కలిసి వాడిని రిక్షాలో కూలవేశారు—

ఏం జరుగుతుందో అని కళ్లు వప్పగించి చూస్తున్నాడు వాడు—

ఆ ఆరుగురూ యోధులూ ఆ రిక్షాను యీడవడం ప్రారంభించారు!!

రిక్షావాడు నవ్వుతున్నాడు!!

చంద్రుడిలో మొర్రి పూర్తిగా ఏర్పడింది!!!